క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణ్ తెలిపారు. మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అర్లి(టి), కరంజి, వడూర్, అంతర్గాం, గొముత్రి గ్రామా ల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా విగ్రహం

నార్నూర్: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే అన్నాభావుసాఠె విగ్రహం, స్వాగతం కమాన్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ కోరారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరవుతున్నట్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చౌక్ వద్ద మాట్లాడుతూ.. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అన్నాభావుసాఠె కమిటీ అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావుదుర్గే, సభ్యులు డిగాంబర్, మాధవ్, నర్సింగ్‌మోరే పాల్గొన్నారు.

స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కు హాజరు

బోథ్: గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేశ్ పాల్గొన్నారు. టీపీసీసీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాక్రే, రాష్ట్ర నాయకులతో కలిసి పలు విషయాలపై చర్చించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీడీవో చౌహాన్ రాధ

బజార్‌హత్నూర్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీడీవో చౌహాన్ రాధ తెలిపారు. శనివారం మండలంలోని జాతర్ల రాయిసెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆవునూరి సక్కుబాయి, సూది సులక్షణ, సుమలతలను సత్కారించారు. ఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా చదవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ పేందుర్ ఈశ్వర్, ఉప స ర్పంచ్ సుజాత, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, ఏపీఎం పవార్ గణేష్, సుశీల, కళాకా రుడు చాకటి రవి, నాగోరావ్, ప్రకాష్, లక్కం శంకర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బోథ్ కోర్టు జడ్జి హుస్సేన్

ఇచ్చోడ: విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కస్తూరిబా పాఠశాల్లో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు, బాల్య వివాహాల గురించి వివరించారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు అంగద్ కేంద్రే, కుమ్మరి విజయ్‌కుమార్, ధమ్మపాల్, పాఠశాల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, కోర్టు సిబ్బంది స్రవంతి, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని కొరిటికల్(బిబి) సమీపంలోని జాతీయ రహదారి మీదుగా శనివారం సత్యనారాయణ అనే వ్యక్తి నిర్మల్ వైపు ఉన్న గుత్పాలకు బైక్‌పై వస్తుండగా.. రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఎన్‌హెచ్ హైవే అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

భగీరథ అందేదెప్పుడో?

- గ్రామాల్లో నీటి ఎద్దడి
- వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా
- పట్టించుకోని అధికారులు



ఫకీర్‌నాయక్‌తండాలో అలంకారప్రాయంగా ట్యాంకు



రిమ్మలో ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు

సిరికొండ: వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య నెలకొంటోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి. గిరిజన గ్రామాల నీటి కష్టాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందడం లేదు.

గ్రామాలకు చేరని భగీరథ నీరు..

రాష్ట్రంలోని ఏ మారుమూల గ్రామానికైనా.. తాగు నీరు అందిస్తామని అధికార పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గ్రామాలకు భగీరథ నీరు అందడం లేదు. మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు, 52 గ్రామాలు ఉన్నాయి. అయితే వారికి తాగునీటి సదుపాయాలు మాత్రం అంతంతే. మండలంలోని రిమ్మ, రాజంపేట్, తిమ్మపూర్, కుంటగూడ, పాలవాగు గ్రామాల్లో ఇప్పటికీ భగీరథ నీరు రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చాలని అధికారులు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు.

అనేక సమస్యలు..

మండలంలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కుమురం భీం ప్రాజెక్టు నుంచి వస్తోంది. ఈ నీటిని వాటర్ ట్యాంకుల్లో నింపుతున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో పైపులైన్ లీకేజీలతో నల్లాల ద్వారా నీరు చేరడం లేదు. పలు గ్రామాలకు పైపులైన్ పనులు కూడా సక్రమంగా చేయలేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. వేసవి దృష్ట్యా లీకేజీ సమస్యలను పరిష్కరించి క్రమం తప్పకుండా భగీరథ నీటిని సరఫరా చేసి, నీటి ఎద్దడిని అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనేక సార్లు విన్నవించినా..



రిమ్మ, రాజంపేట్, తిమ్మపూర్ గ్రామాలకు ఇప్పటి వరకు భగీరథ నీరు రాలేదు. దీంతో అనేకసార్లు అధికారులకు విన్నివించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పంచాయతీ వాటార్ ట్యాంకు ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నాం.

– పెందుర్ అనిల్, సర్పంచ్, రిమ్మ

నీటి కోసం తిప్పలు

వేసవి కాలం వచ్చిందంటే చాలు పనులు పక్కన పెట్టి నీటిని తెచ్చుకోవడంతోనే వేసవి గడిచిపోతుంది. మా గ్రామానికి ఇప్పటి వరకు భగీరథ ద్వారా నీటి సదుపాయం కల్పించలేదు. దీంతో నీటి కోసం తిప్పలు పడుతున్నాం.

– మాదావి గంగారాం, కుంటగూడ సర్పంచ్

గొల్లఘాట్‌లో నీటి కష్టాలు



ట్యాంక్ వద్ద బిందెలతో మహిళలు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామంలో వేసవికాలం ప్రారంభంలోనే గ్రామస్తులకు నీటి కష్టాలు తప్పడం లేదు. పెన్‌గంగ నదిఒడ్డున ఉన్న గొల్లఘాట్ గ్రామానికి భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్తులు వాటర్ ట్యాంక్‌పై ఆధారపడుతున్నారు. భగీరథ నీరు వారానికి రెండు సార్లు మాత్రమే వస్తున్నాయని, వచ్చినా.. రెండు బిందెల కంటే ఎక్కువ రావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణంలోని బసవేశ్వర చౌక్‌లో లింగాయత్, లింగబలిజ సమన్వయ సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, విద్యానగర్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మనోహర్, అన్నదానం జగదీశ్వర్, నిఖిల్, శివ, విజయ్, సతీష్, రమాకాంత్, వంశీ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ప్రజల దాహర్తిని తీర్చేందుకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, రాజేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒకే బ్యాంకుతో తప్పని తిప్పలు



బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు (ఫైల్)

- 25 వేల మంది ఖాతాదారులు
- గంటల తరబడి పడిగాపులు
- తరుచూ సాంకేతిక సమస్యలు

గుడిహత్నూర్: ప్రజలకు ఆర్థిక క్రమశిక్షణ అందించడంతో పాటు వారి అవసరాల కోసం సత్వర సేవలు అందించేందుకు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం బ్యాంకులను ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు నగదును ఇళ్లలో దాచుకోకుండా బ్యాంకుల్లో దాచుకోవడం అలవర్చుకున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. సొమ్ము తీసుకోవడానికి బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గంటలు, రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

ఒకే బ్యాంకు.. అధికంగా ఖాతాదారులు

మండల కేంద్రంలో ప్రధాన బ్యాంక్‌గా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలందిస్తోంది. దీనితో పాటు ఆరేళ్ల క్రితం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేశారు. అయితే అధికంగా ఖాతాదారులు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పరిధిలో ఉన్నారు. మండలంలో 21 రెవెన్యూ గ్రామాల పరిధిలో 62 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 44 గ్రామాల వారికి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కేటాయించారు. 25 వేల మంది ఖాతాదారులు సేవలు అందిస్తోంది. వ్యవసాయదారుల ఖాతాలు 3,200, సేవింగ్ ఖాతాలు సుమారు 20వేల వరకు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల ఖాతాలు 320, ఇతర కరెంట్ ఖాతాలు, క్రెడిట్ కార్డు ఖాతాలు కూడా ఉన్నాయి.

తప్పని తిప్పలు

బ్యాంకు ద్వారా రైతుబంధు, పంట రుణాలు, మహిళా సంఘాల రుణాలతో పాటు రోజు వారీ సాధారణ లావాదేవీలు జరుగుతాయి. అయితే పంట పెట్టుబడులతో పాటు ఆర్థిక అవసరాల కోసం నగదు అవవసరమైన ఖాతాదారులు బ్యాంకు ఎదుట పడిగాపులు పడుతున్నారు. తరుచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతుండడంతో రోజుల తరబడి బ్యాంకు లావాదేవీలు నిలిచిపోతున్నాయి.

ప్రైవేట్ ఆపరేటర్ల వద్దకు..

బ్యాంకు వద్ద బారులు తీరిన జనాలు, సాంకేతిక సమస్యలను చూసి కొంత మంది ఖాతాదారులు ప్రైవేట్ ఏటీఎం ఆపరేటర్ల వద్దకు వెళ్తున్నారు. ఇదే అదనుగా వారు రూ. వెయ్యికి రూ.20 నుంచి 50 వసూలు చేస్తున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో అడిగినంత ఇచ్చి ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నేను సిమెంట్ వ్యాపారిని లక్షల్లో లావాదేవీలు చేయాల్సి ఉంటుంది. ఈ బ్యాంకు ద్వారా తరుచూ సాంకేతిక సమస్యలు, సిబ్బంది సమస్య ఏర్పడుతోంది. సకాలంలో పనులు జరగడం లేదు. సేవలు వేగంగా అందేలా చూడాలి.

శివ, సిమెంట్ వ్యాపారి, గుడిహత్నూర్

సన్మానం

ఆదిలాబాద్‌అర్బన్: విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన భాగ్యలక్ష్మిని శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కరం కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు.

రాగిపిండి ప్యాకెట్ల పంపిణీ

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు రాగిపిండి ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో రాపల్లి ఆశన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఒక్కొక్క విద్యార్థికి 10 గ్రాముల చొప్పున ఉదయం 6 గంటలకు రాగిపిండి అందించాలని సూచించారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని తర్నం గ్రామానికి చెందిన నిర్మల్ జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ విజయలక్ష్మి తండ్రి ఎర్ర గంగరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మాజీ మంత్రి గోడం నగేశ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి పరామర్శించారు. వారి వెంట ఇచ్చోడ మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడె శీల, బోథ్ ఏఎంసీ డైరెక్టర్లు కుంట కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉప్పు పోశెట్టి, గాదె శంకర్, శివారెడ్డి, విశాల్ పాల్గొన్నారు.

నేడు శనగ కొనుగోళ్లు బంద్

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో నాఫెడ్, ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శనగ కొనుగోళ్లు ఆదివారం సెలవు దినం కారణంగా ఉండవని ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్ తెలిపారు. సోమవారం తిరిగి కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు.

పరిహారం అందజేయాలి



దగ్ధమైన శనగ కుప్పను పరిశీలిస్తున్న సంగెం బొర్రన్న

ఇచ్చోడ: కౌలు రైతు భగ్నూరే లక్ష్మణ్‌రావుకు చెందిన శనగ కుప్ప కాలిబూడిదైన ఘటనలో బాధిత రైతులకు పరిహారం అందించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో దగ్ధమైన శనగ కుప్పను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన పంచనామా ఆధారంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రైతుకు పరిహారం అందించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

జైనథ్: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని ఆనందపూర్‌లో ఈజీఎస్ నిధులు రూ. 10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులైన రోడ్లు, మురికి కాలువలు, తాగు నీటి వసతి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్ రెడ్డి, వామన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అధ్వానంగా డ్రెయినేజీలు



తలమడుగు: మండలంలోని ఉండమ్ గ్రామంలో డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కనీసం డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: ఎంపీవో దిలీప్, ఫోన్: 90008 73509

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కిషన్ మహారాజ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మావల మండలంలోని దుర్గానగర్‌లో శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయంలో శతచండీ మహాయాగం నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. శనివారం ఆలయంలో శ్రీరుద్ర సహిత శతచండీ విశ్వశాంతి మహాయాగానికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు కిషన్ మహారాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. మహాయాగం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఈనెల 24, 25, 26న మహాయాగం నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. 108 యజ్ఞ గుండాలలో యాగ క్రతువును జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేష్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, కౌన్సిలర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడితో సరదాగా..

ఆదిలాబాద్‌టౌన్: అనునిత్యం అధికారిక, పార్టీ కార్యక్రమాలతో బిజీగా ఉండే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం ఓ టీ కొట్టులో కనిపించారు. తన బాల్య స్నేహితుడు సత్యనారాయణతో టీ తాగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రిమ్స్ సమీపంలో తన స్నేహితుడు కనిపించడంతో వాహనాన్ని నిలిపిన కాసేపు సరదాగా గడిపారు. దీన్ని ప్రజలు ఆసక్తిగా గమనించి చర్చించుకున్నారు.

జీపీ భవనంలోనే పాఠశాల



పంచాయతీ భవనం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్



పాఠాలు వింటున్న విద్యార్థులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ పంచాయతీ భవనంలో విద్యార్థులకు గత ఐదు నెలలుగా పాఠాలు బోధిస్తున్నారు. మనఊరు.. మన బడి కింద మరమ్మతుల కోసం రూ.59 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో భవనాన్ని తొలగించి నూతనంగా గదుల నిర్మాణం చేపడుతున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక గ్రామంలోని పంచాయతీ భవనాన్ని పాఠశాలగా వినియోగిస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. 6,7,8 తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులకు మూత్రశాలలు లేకపోవడంతో తాత్కాలికంగా పరదాలు కట్టారు. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అట్టహాసంగా పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ – 2 పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థుల కేరింతలు, చప్పట్ల నడుమ విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమానికి డీఈవో ప్రణీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని సన్మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బచన్ సింగ్, ఉపాధ్యాయులు సుకుమార్, రేణుకా, బాలప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో గల శ్రీసరస్వతి శిశు మందిర్ 53వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు సంస్కృతికి నిలయాలుగా నిలుస్తున్నాయన్నారు. చిన్నారులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త బజరంగ్లాల్ అగర్వాల్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంచాలక్ నిమ్మల ప్రతాపరెడ్డి, సెక్టోరియల్ అధికారి నారాయణ పాల్గొన్నారు.